నిందితుల అరెస్ట్ చూపుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

రూ.5.74లక్షల సొత్తు స్వాధీనం

జనగామ, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో వరుస దొంగతనాలతో అలజడి సృష్టిస్తున్న ముగ్గురు దొంగలను పట్టుకున్నట్లు డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డీసీపీ మాట్లాడుతూ కూలి పనులు చేసుకుంటూ ఉండే వీరు తాగుడు, జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఎస్సై భరత్ ఆధ్వర్యంలో సోమవారం నెహ్రూపార్కు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కొందరు కనిపించారు. కుమార్, బూరుగు యాదగిరి, తలతోటి ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకొని, వీరి నుంచి 7.3 తులాల బంగారు నగలు, 64 తులాల వెండితో కలిపి మొత్తం రూ.5,74,320 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ముగ్గురు దొంగలు తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో చొరవచూపిన ఎస్సైతోపాటు ఏఎస్‌ఐ శంకర్, కానిస్టేబుళ్లు రామన్న, అనిల్‌కుమార్, సురేశ్‌ను వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.

మహాదేవస్వామి ఆలయంలో భక్తుల పూజలు

రఘునాథపల్లి, ఆగస్టు 12: మండల కేంద్రంలోని శ్రీమహాదేవస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా ఆలయ పూజా రి పింగ్రిపోలు శ్రీనివాస్‌శర్మ నేతృత్వంలో అర్చనలు నిర్వహించారు. మహిళలు ఉదయమే ఆలయం వద్దకు చేరుకొని స్వామివారికి నైవే ద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూరెళ్లి పెద్ద ఉపేందర్‌గుప్తా –రేణుక దంపతులు, లగిశెట్టి లింగయ్య, ఆకుల జ్యోతి, కెన్నె రమ, గందె మంజుల, జానకి పాల్గొన్నారు.

సీఐ దంపతులకు తృటిలో తప్పిన ప్రమాదం

పాలకుర్తిరూరల్, ఆగస్టు 12: రోడ్డు ప్రమాదంలో పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి దంపతులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదివారం రాత్రి సూర్యాపేట జిల్లా ఆర్వపల్లి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సూర్యాపేటలోని బంధువుల ఇంట్లో శుభ కార్యానికి ఆదివారం మహేందర్‌రెడ్డి తన సతీమణితో కలిసి వెళ్లి తిరిగి ప్రయాణంలో కారులో పాలకుర్తికి వస్తున్నారు. మార్గ మధ్యలో ఆర్వపల్లి మండలం ఆదివేములో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి హోటల్‌లోకి దూసుకెళ్లింది. ఈఘటనలో సీఐ మహేందర్‌రెడ్డి దంతులకు గాయాలవడంతో స్థానికులు చికిత్స కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ దవాఖానకు తరలించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 12 : సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న వారిలో ఇటీవల మరణించిన వారికి స్థానిక ఎమ్మార్సీ భవనంలో సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంటల యాదగిరి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు తక్కువ వేతనాలు ఇస్తూ అదనపు పనిభారం పెంచారని తెలిపారు. వేతనాలు సరిపోక అనేక మంది మానసిక వేదనతోపాటు గుండెపోటుతో మృతి చెందారని వివరించారు. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ నాయకులు గోరంట్ల యాదగిరి, ప్రజ్ఞాపురం వెంకటేశ్వర్లు, తాటికొండ రమేశ్, రౌతు రాంగోపాల్, దుస్స ప్రవీణ్ కుమార్, శివరాత్రి సునీత, బక్కం రాజ్‌కుమార్, పుట్ట స్వామి, లవన్‌కుమార్, శ్రీలత, గుండు రామతులసి, జ్యోతి, మాచర్ల రమేశ్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలి

కొడకండ్ల, ఆగస్టు 12 : గీత కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాటమయ్య గుడిలో దేశగాని శ్రీశైలం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ నెల 2న నిర్వహించిన బొలగాని పుల్లయ్య 36వ వర్ధంతి నుంచి 18న జరిగే సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్యయాత్ర నిర్వహిస్తున్నామని అన్నారు. గీత కార్మికులకు సేఫ్టీ మోకులు ఇవ్వాలని, ప్రమాదానికి గురై మృతి చెందారి వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వడ్లకొండ వెంకటేశ్, పనస చంద్రమౌళి, మండల కార్యదర్శి పనస రాములు, మామిడి మల్లయ్య, నర్మెట శేఖర్, నర్మెట శ్రీను, ఐల వెంకన్న, పల్లె ఉప్పలయ్య, పనస ఐలయ్య, దూపటి వెంకన్న, పనస వెంకన్న, దండెపల్లి సోమయ్య, కప్పల నాగయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, RAPARTHY RAJESHWAR (New name) previously called RAPARTHY RAJESAWAR (Old Name), S/o RAPARTHY NAGAIAH, R/o. "H" Towers, Flat no. 302, Opp: Filter bed, Warangal district - 506002. T.S. Solemnly declare.

NTW-17194

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

దోమల నివారణకు ఫాగింగ్

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 12 : దోమల నివారణ కోసం వారం రోజులుగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఏదునూరి సత్యం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో రోడ్ల పై, డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమల నివారణ కోసం ప్రతి రోజూ రెండు వార్డుల్లో ఫాగింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 12 : గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందినట్లు సీఐ వేణు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో 50 ఏళ్లున్న గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు వివరించారు. మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించామని తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీజ్

చిల్పూరు, ఆగస్టు 12 : మండలంలోని మల్కాపూర్‌లో బొర్ర రామానాదం బెల్ట్‌షాపుపై సోమవారం తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన రూ.36 వేల విలువైన మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్, హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, కానిస్టేబుళ్లు ఇంద్రచారి, అనిల్ పాల్గొన్నారు.

గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట, ఆగస్టు 12 : గోదావరి జలాలతో మండలంలోని చెరువులు నింపాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్స్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. అనంతరం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో పదేండ్లు గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో రైతన్న సంక్షేమానికి పెద్ద పీట వేశారని వివరించారు. గోదావరి నది నీళ్లు వృథాగా సముద్రంలో కలుస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జనగామ నియోజకవర్గంలోని రిజర్వాయర్లు నింపి, వాటి ద్వారా గ్రామాల్లోని చెరువులు, కుంటలు నింపాలన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పంట పెట్టుబడి సాయం రైతుబంధు క్రమం తప్పకుండా వేశామని, కాంగ్రెస్ సర్కారు వచ్చాక రైతులకు అందించలేదని విమర్శించారు. సాగునీరు లేక, భూగర్భ జలాలు అడుగంటి పంటలకు నీరందడం లేదన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. జనగామ ప్రాంతంలో దుర్భిక్షం నెలకొందన్నారు. బచ్చన్నపేట మండలంలో పాడి పరిశ్రమ ద్వారా రైతులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అయితే పాల బిల్లులు సక్రమంగా రావడం లేదన్నారు. మండల ప్రజలు ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో ఉండాలన్నదే తన లక్ష్యమన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నియోజకవర్గ ప్రజలకు నీలిమా హాస్పిటల్‌లో ఉచితంగా పేద ప్రజలకు వైద్యం అందిస్తానన్నారు. బచ్చన్నపేట అంటే కేసీఆర్‌కు ఎంతో మక్కువని, బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడైనా గుడి చెరువు ఎండిపోయిందా అని ప్రశ్నించారు. రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే వెంటనే గోదావరి జలాలతో చెరువులు నింపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, వైస్ చైర్మన్ మద్దికుంట రాధ, నాయకులు మల్లారెడ్డి, కొండి వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి నరెడ్ల బాల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, వేముల విద్యాసాగర్‌గౌడ్, బావండ్ల కృష్ణంరాజు, నరేందర్, ఉపేందర్‌రెడ్డి, వేణుగోపాల్, మధుప్రసాద్, భాస్కర్‌రెడ్డి, ఐలయ్య, బాలచందర్, సిద్ధారెడ్డి, కాంసాని సిద్ధారెడ్డి, ఆజాం, కిష్టయ్య, శివకుమార్, జావీద్, సతీశ్, రాజుగౌడ్, నర్సిరెడ్డి, తిరుపతి గౌడ్, శ్రీధర్, లక్ష్మన్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, నర్సిములు, హరిప్రసాద్, భాస్కర్, కైసర్,దూడల కనుకయ్యగౌడ్, కిష్టయ్య, మహేందర్‌రెడ్డి, జలంధర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

కొండయ్యను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఆగస్టు 12: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం మండలంలో పర్యటించారు. పెదమడూరు శివాలయ అర్చకుడు మూటకొండూరు శ్రీనివాస్‌శర్మ ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్‌శర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీతారాంపురంలో బీఆర్‌ఎస్ నాయకుడు బాషిపాక కొండయ్య భార్య స్వప్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. దేవరుప్పులలో ఊడుగు సత్యనారాయణ తల్లి ముత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. పెద్ది వెంకన్న తల్లి లచ్చమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. సింగరాజుపల్లిలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు మేకపోతుల నర్సింహులు భార్య రేణుక రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆమెను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, బస్వ మల్లేశ్, కారుపోతుల భిక్షపతి, చింత రవి, ధరావత్ రాంసింగ్, ఈదునూరి నర్సింహారెడ్డి, ఏల సుందర్, కోతి ప్రవీణ్, పానుగంటి కృష్ణ, నలుగూరు పరశురాములు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేత

బచ్చన్నపేట, ఆగస్టు 12 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు జంగిటి విద్యానాథ్ సొంత ఖర్చులతో ఉచితంగా బస్‌పాస్‌లు అందించారు. ఆర్టీసి సిబ్బంది జ్యోతి భైరయ్య, ఆడెపు కిషన్ సమక్షంలో బస్‌పాస్‌లు అందించారు. విద్యానాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. విద్యార్థుల ఉన్నతికి తనవంతు సాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి, నాయకులు నల్లగోని బాల కిషన్‌గౌడ్, అయిలుమల్లయ్య, ఆల్వాల ఎల్లయ్య, సుధాకర్‌రెడ్డి, ఎద్దు హరీశ్, బందారపు క్రాంతి కుమార్, ఆర్టీసీ డ్రైవర్ రాజయ్య, కండక్టర్ యుగంధర్ , పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బచ్చన్నపేట, ఆగస్టు 12 : హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్‌నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బచ్చన్నపేట మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కరాటే మాస్టర్ విక్రమ్ ఆధ్వర్యంలోని వేద కరాటే ఆకాడమీలోని విద్యార్థులు 19 మంది పసిడి, కాంస్య పతకాలు సాధించారు. గచ్చిబౌలిలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో బచ్చన్నపేట, జనగామ, ఎర్రగొల్లపహడ్, హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోచన్నపేటకు చెందిన పోతుల కరుణాకర్‌ఆశ్విని దంపతుల కుమారుడు మనోజ్ఞ కటాస్ విభాగంలో ప్రతిభ కనబర్చి రజిత పతకం సాధించాడు. ప్రతిభ చూపిన వారిని విక్రమ్ అభినందించారు. టోర్నీలో పాల్గొన్న నేపాల్, భూటాన్ రాష్ర్టాల మాస్టర్లు విద్యార్థులను అభినందించారు.

బచ్చన్నపేట తహసిల్‌లో గ్రీవెన్స్

బచ్చన్నపేట, ఆగస్టు 12 : మండల కేంద్రంలోని తహసిల్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ అధికారులు గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. డీటీ ఫణి కిశోర్ ఆధ్వర్యంలో పలు శాఖలకు చెందిన అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మండల స్థాయిలో పరిష్కరించే వీలున్న దరఖాస్తులను ఇక్కడే పరిష్కరిస్తామని, మిగిలినవి జిల్లా కేంద్రంలోని ఆయా శాఖల అధికారులకు పంపించి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాస్‌రావు, మున్వర్ పాల్గొన్నారు.

సాయుధ పోరాట వీరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 12 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజల హక్కుల కోసం పోరాడిన వీరులను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ కోరారు. సెప్టెంబర్ 1 నుంచి 17 వరకు నిర్వహించే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల కరపత్రాలను సోమవారం మండలంలోని ఇప్పగూడెంలో ఆవిష్కరించారు. నరసింహ మాట్లాడుతూ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలపై రాష్ట్ర వ్యాప్తంత శౌర్యయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజానాట్యమండలి కళాకారులతో వీర తెలంగాణ నాటిక ప్రదర్శిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలకులు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వీర తెలంగాణ పోరాటాన్ని ముస్లింలకు, హిందువులకు మధ్య పోరాటంగా చిత్రీకరిస్తున్నారని ఆయన విమర్శించారు. నాడు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పెత్తందార్లకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి పూర్వ రాష్ట్ర కార్యదర్శి రాంపల్లి రమేశ్, ఉపాధ్యక్షుడు సాంబరాజు యాదగిరి, మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మునిగెల రమేశ్, రైతు సంఘం నాయకులు గట్ల మల్లారెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు తోడెంగల ఐలయ్య, నాయకులు కత్తుల రాజు, కరుణాకర్, పొలాసు పరమేశ్, లింగనబోయిన శ్రీకాంత్, నీరటి సంపత్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు

జఫర్‌గఢ్, ఆగస్టు 12 : మండలంలోని హిమ్మత్ నగర్ శివారు గువ్వలగూడేనికి చెందిన నీరటి దేవేందర్ ఇటీవల మృతి చెందాడు. ఈ క్రమంలో హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2012–13 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన నీరటి దేవేందర్ మిత్రులు సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. దేవేందర్ కుటుంబానికి చేయూతనిచ్చిన మిత్రులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో బైరపాక మహేశ్, తాటికాయల శ్రీకాంత్, యాతం వెంకటేశ్, నక్క సదయ్య, శ్యామ్, శ్రీధర్ పాల్గొన్నారు.

కేజీబీవీ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు

రక్తనమూనాల సేకరణ పరిశుభ్రతపై అవగాహన

చౌడారం కేజీబీవీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో వివరిస్తున్న డాక్టర్ జనార్దన్

రఘునాథపల్లి, ఆగస్టు 12: మండలంలోని కోమల్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో చౌడారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి నస్రీన్ నేతృత్వంలో 119 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యాధికారి నవీన్ మాట్లాడుతూ వర్షకాలం సీజన్‌లో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాణి, సీహెచ్‌వో శీనారాణి, హెచ్‌ఈవో ప్రభాకర్, మోహీన్, హెల్త్ సూపర్‌వైజర్ బిక్కునాయక్, హెల్త్ అసిస్టెంట్ మనోహర్‌బాబు, ఏఎన్‌ఎం వసంత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ..

స్టేషన్ ఘన్‌పూర్ : స్టేషన్ ఘన్‌పూర్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ జనార్దన్ తెలిపారు. 170 విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో ఎక్కువ మందికి చర్మ సంబంధ వ్యాధులున్నట్లు గుర్తించామన్నారు. చికిత్స నిమిత్తం మందులు అందించామని ఆయన తెలిపారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామని పేర్కొన్నారు. ఈ క్యాక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవీందర్, డాక్టర్లు సంధ్య, పవన్, సీహెచ్‌వో వెంకటస్వామి, సూపర్‌వైజర్ సునంద, ఏఎన్‌ఎంలు ప్రేమలత, భవాని పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

దేవరుప్పుల : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు సోమవారం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎం వసంత నేతృత్వంలో పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి, శాంపిళ్లను పరీక్షలు నిమిత్తం జనగామ ఏరియా దవఖానకు పంపించారు. పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ చింత యాకయ్య, ఆశ కార్యకర్తలు, జ్యోతి పుష్ప పాల్గొన్నారు.

అనుమతిలేని వెంచర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

చర్యలు కోసం షేక్‌రిజ్వాన్‌బాషాకు నీర్మాలవాసుల వినతి

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నీర్మాల గ్రామస్తులు

దేవరుప్పుల, ఆగస్టు 12: మండలంలోని నీర్మాలలో అనుమతులు లేకుండా వెంచర్ చేసిన వ్యక్తులపై, ఒక్కొక్కగుంట నాలా చేసిన దేవరుప్పుల తహసీల్దార్‌పై సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో స్థానికులు జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్ భాషాకు ఫిర్యాదు చేశారు. నీర్మాలలో రెండున్నర సంవత్సరాల క్రితం సర్వే నంబర్లు 3,6,8, 22, 23,24, 30,31,32,44లో 16 ఎకరాల వ్యవసాయ భూమిని కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ చేశారు. సర్వే నంబర్లు 30,31,32లో ఒక్కో గుంట భూమిని వ్యవసాయ భూమి నుంచి నాలాకు బదలాయించారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సి ఆదాయానికి తహసీల్దార్ చర్యల వల్ల గండి కొట్టినట్లయిందని వారు కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు డీటీసీపీ అనుమతులు తీసుకుని వెంచర్ చేయాల్సిన సదరు వ్యక్తులు దాన్ని ఉల్లంఘించి ప్లాటింగ్ చేశారని డీపీవోకు లిఖిత పూర్వక ఫిర్యాదును అందించారు. వీరి చర్యల వల్ల గ్రామపంచాయతీకి రావాల్సిన ఎకరన్నర భూమి రాకపోగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని స్థానికులు తెలిపారు. దీనిపై విచారణ జరిపి సంబంధిత అధికారులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ సదరు వెంచర్ చేస్తున్న వారితో ఫోన్‌లో నేరుగా మాట్లాడారని ఫిర్యాదుదారులు తెలిపారు. విచారణ జరిపి సదరు వ్యక్తులపై కేసు నమోదు చేయాలని ఆర్డీవోకు తెలిపారని వివరించారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో గ్రామానికి చెందిన సింగారపు రమేశ్, చింతల రవీందర్ రెడ్డి, భిక్షపతి, కాసర్ల మాధవ రెడ్డి, నల్ల నరేందర్, వడ్లకొండ ప్రశాంత్ ఉన్నారు.

నేడు జనగామలో శాంతియుత బంద్

జనగామ ఆగస్టు 12(నమస్తే తెలంగాణ) : బంగ్లాదేశ్‌లో హిందువులకు మద్దతుగా మంగళవారం శాంతియుతంగా జనగామ బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు వీహెచ్‌పీ, హిందూ సంఘాల బాధ్యులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భారత్ నుంచి ఉన్నత చదువుల కోసం బంగ్లాదేశ్‌కు వెళ్లిన హిందువులపై దాడులు జరుగుతున్నాయని, మహిళలపై లైంగిక దాడులు కొనసాగుతున్నాయని తెలిపారు. దుండగులను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


జనగామలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేతలు

త్వరలో ఆర్‌వోఆర్ చట్టం తీసుకొస్తాం : కోదండరెడ్డి

బచ్చన్నపేట, ఆగస్టు 12 : రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఈ నేపథ్యంలో 2024–ఆర్‌వోఆర్ చట్టాన్ని త్వరలో తీసుకురాబోతున్నామని కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బండనాగారానికి వచ్చిన ఆయన సుమారు 30 మంది రైతులకు చెందిన 45 ఎకరాల భూమికి సంబంధించి సమస్యపై ఆయన మాట్లాడారు. తెలంగాణలో భూ సమస్యలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ధరణిలో ఏమైనా మార్పులు, చేర్పులుంటే సలహాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయమై ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తేలుకంటి మురళి, గౌరవాధ్యక్షుడు వీరగౌడ్ నేతృత్వంలోని జర్నలిస్టులు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన కోదండరెడ్డి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట కిసాన్ జిల్లా కోఆర్డినేటర్ పిన్నింటి నారాయణరెడ్డి, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు భిక్షపతి, హరికుమార్, కోనేటి స్వామి, కరుణాకర్, బాలసిద్దులు, బాలు, తిర్మల్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశం ఉన్నారు.

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గిరిజన పాఠశాలను పరిశీలించిన కొమ్మూరి

జనగామ, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ) : జనగామలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సోమవారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సందర్శించారు. పక్కా భవనం కోసం 5 ఎకరాల భూమి కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, గిరిజన సంఘాల నాయకులు మూడ్ లక్ష్మణ్ నాయక్, గుగులోత్ లచ్చయ్య నాయక్, భూక్యా చందు నాయక్, రామావత్ మీట్యా నాయక్, నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.

లింగాల ఘనపురం ఎస్సైగా శ్రవణ్‌కుమార్

బాధ్యతలు చేపట్టిన శ్రవణ్‌కుమార్

లింగాలఘనపురం, ఆగస్టు 12: లింగాల ఘనపురం ఎస్సైగా శ్రవణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహరించాలని కోరారు. మండలంలోని యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గుట్కా, జూదం, గుండుబా, ర్యాగింగ్ నివారణకు కృషి చేయాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఎవరైనా తమకు సమస్యలుంటే దళారులను ఆశ్రయించకుండా, పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 12 : గంజాయి, గుడుంబా, గుట్కా వంటి మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా చట్టరీత్యా నేరమేనని ఏసీపీ భీంశర్మ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని శివునిపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గుర్తు తెలియని వ్యక్తుల పంపించే లింకులను ఓపెన్ చేసినా, ఓటీపీలు చెప్పినా మోసపోతారని ఆయన తెలిపారు. బాధితులుంటే 1930కి నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ వేణు, ఏఎస్సై రాజమౌళి, కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ బావులకు కెపాసిటర్లు బిగించాలి

రఘునాథపల్లి, ఆగ స్టు 12: రైతులు వ్యవసాయ బావుల వద్ద కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ మనోహర్‌రెడ్డి అన్నారు. మం డల కేంద్రంలో సోమవారం పొలంబాట నిర్వహించారు. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ తీగలు వేలాడితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తే సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు ప్లాస్టిక్ స్టాటర్ డబ్బాలను వినియోగించాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటే తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాహుల్, ఫోర్‌మెన్ వీరాంజనేయులు, లైన్ ఇన్‌స్పెక్టర్ స్వామి, లైన్‌మెన్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ సీహెచ్‌వోకు పలువురి శుభాకాంక్షలు

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 12 : దేవురుప్పులలో పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించి పదోన్నతిపై డిప్యూటీ సీహెచ్‌వోగా స్టేషన్ ఘన్‌పూర్‌కు వచ్చిన చింత వెంకటస్వామిని లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు పలువురు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ కేంద్రానికి చెందిన చింత వెంకటస్వామి దవాఖాన సిబ్బంది తోపాటు లయన్స్ క్లబ్ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు సన్మానించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ కుమార్, లెప్రసి సబ్ యూనిట్ అధికారి మురహరి, సబ్ యూనిట్ అధికారి శేషయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు ఆమంచ మధుసూదన్, వీటీ శ్రీనివాస్, మామిడాల వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అగస్టిన్ రెడ్డి, హోలీ క్రాస్ ప్రిన్సిపాల్ ఫాదర్ బాల, ఎమ్మార్పీఎస్ నాయకులు జోగు కుమారస్వామి, తాటికొండ జ్యోతి కుమార్, గాదె రాములు, రాజారపు ఎల్లేశ్ పాల్గొన్నారు.

క్షీరగిరి క్షేత్రంలో భక్తుల కోలాహలం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పాలకుర్తి, ఆగస్టు 12: స్వయంభు సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి క్షీరగిరి క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. శ్రావణ మాసం రెండో సోమవారం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులతో పరిసరాలు కిక్కిరిసిపోయాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, సహస్రనామార్చన చేశారు. లక్ష్మీనరసింహాస్వామికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ దిగువన ఉన్న ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు పూజలు నిర్వహించారు. సోమేశ్వరుడిని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగేందర్‌రావు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్ శర్మ, దేవగిరి ఆనిల్‌కుమార్, మత్తగజం నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుకున్న పాఠశాలకు ఎన్ఆర్ఐ చేయూత

బచ్చన్నపేట, ఆగస్టు 12 : తాను చదువుకున్న పాఠశాలకు చేయూతనిచ్చేందుకు బచ్చన్నపేటకు చెందిన పూర్వ విద్యార్థి పులిగిళ్ల శ్రీనివాస్ రూ.50 వేలు విరాళం అందించారు. విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని క్లాస్‌మేట్, పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న పృథ్వీరాజ్ వివరించడంతో వెంటనే రూ. 50 వేలు ఫోన్‌పే ద్వారా పంపించారు. వీటితో కొత్త బోరుమోటరు కొనుగోలు చేయడంతో పాటు పైపులైన్ వేసి తాగునీటి సరఫరాను మెరుగుపర్చారు. హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు సాయం అందించిన శ్రీనివాస్‌కు ధన్యావాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు రామచంద్రం, యాదయ్య పాల్గొన్నారు.